క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి బంగారం వితరణ



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో కొండపై వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయానికి గద్వాలకు చెందిన పర్దిలైజర్ షాపు శ్రీనివాసులు శ్రీదేవి దంపతులు 2 తులాల బంగారం కిరీటం అమ్మవారికి కోసం ఆలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు శేషిరెడి, వెంకటేశ్వర్‌రెడ్డి, గోపి, తిమ్మారెడి, పద్మారెడ్డి పాల్గొన్నారు.

మల్లాపురంలో వైద్య పరీక్షలు



కేటీదొడ్డి: మండలంలోని మల్లాపురం తండా, గ్రామంలో జ్వరంతో బాధపడుతున్న వారికి సర్పంచు శంకరమ్మ ఆధ్వర్యంలో వైద్యాధికారులు ఆదివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని డెంగీ, మలేరియా, టైపాయిడ్‌ల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య బృందం హుస్సేన్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

ఎన్నికలప్పుడే దళితులు గుర్తొస్తారా?



గద్వాల అర్బన్: బీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల సమయంలోనే దళితులు గుర్తుకొస్తారా అని కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి శెట్టి ఆత్మకూర్ లక్ష్మణ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ శివారులో సంగాల పార్కు వద్ద రెండేళ్ల క్రితం ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి నేటికీ పనులు ప్రారంభించలేదన్నారు. దళితుల సంక్షేమం, అభివృద్ధి పట్టించుకోని పాలకులు నేడు ఓట్ల కోసం దళిత సమ్మేళనాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. ప్రతి దళితునికి దళితబంధు పథకం ఇచ్చి ఓట్లు అడగాలన్నారు. సమావేశంలో నాయకులు ఇమానియేల్, రాజు, ఆనందం, వీరేష్, దాసు ఉన్నారు.

ఫొటో ఎగ్జిబిషన్ వాల్‌పోస్టర్ల విడుదల



గట్టు: హైదరాబాద్‌లో ఈ నెల 6,7,8 తేదీల్లో నిర్వహించే ఫొటో ఎగ్జిబిషన్‌కు సంబంధించిన పోస్టర్లను ఆదివారం గట్టులో ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం సభ్యులు విడుదల చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం తరపున గుర్తింపు కార్డులను జిల్లా అధ్యక్షుడు శేఖర్, మండల అధ్యక్షుడు నర్సింహ, ఉపాధ్యక్షుడు కమ్మరి వెంకటేష్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుధీర్‌కుమార్, త్యాగరాజు, వీరేష్, విశ్వనాథ్, శీను, పోలన్న, వివిధ గ్రామాలకు చెందిన ఫొటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మిలాద్–ఉన్–నబీ ర్యాలీ

ఆత్మకూర్: మిలాద్–ఉన్–నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. మానవాళి కోసం ప్రవక్త చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ప్రవక్త జీవితం శాంతి సందేశమని మౌలానాలు వివరించారు. పట్టణంలోని పురవీధుల మీదుగా ర్యాలీ అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, ఎస్‌ఐ నరేందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అమరచింత: పట్టణంలో మిలాద్–ఉన్–నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జామియా మసీదులో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం ముస్లింల ర్యాలీని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, అన్సారీ, ఖాజాహుస్సేన్, రఫీ, తౌఫిక్ పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని మసీద్ నుంచి ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్–ఉన్–నబీ ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వెలవెలబోతున్న చెరువులు

- ఎండుతున్న పంటలు
- ఆయకట్టు భూములకు సాగునీరు కరువు
- తగ్గిన భూగర్భ జలాలు



ఎక్లాస్‌పురంలో వాడుముఖం పట్టిన మిరుప పైరు



నీరులేక వెలవెల పోతున్న శేషమ్మ చెరువు

అయిజ: వర్షాకాలం కురిసిన వర్షాలకు చెరువులు నిండుకుండల్లా కళకళలాడాల్సి ఉండగా, వర్షాభావ పరిస్థితుల వల్ల చెరువులు వెలవెల బోతున్నాయి. ఆయకట్టు భూములకు సాగునీరు కరువై పంటలు ఎండుతున్నాయి. చుట్టూ పరిసర ప్రాంతాల్లో బోరు బావుల్లో భూగర్భ జలాలు తగ్గి, పంటలకు సాగునీరు చాలడంలేదు. దాని వల్ల పంటలు వాడుముఖం పట్టాయి. మండలంలో అయిజ శివారులోని కొత్త చెరువు, ఎక్లాస్‌పురం శివారులోని ఆచార్యుల చెరువు, ఎర్రకుంట, నల్లకుంట, బీ తిమ్మాపూర్ శివారులోని శేషమ్మ చెరువు, ఉత్తనూరు శివారులోని న్యూ ట్యాంక్ చెరువులు నిండలేదు.

సాగు చేసిన పంటలు..

మండలంలో ఈ ఏడాది వానాకాలంలో సుమారు 50,000 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగుచేశారు. జూన్‌లో కురిసిన వర్షాలకు 402 ఎకరాల్లో కంది, 832 ఎకరాల్లో ఆముదం, 8,603 వేరుశనగ, 20,240 ఎకరాలలో పత్తి పంటలను సాగుచేశారు. సుమారు 15,000 ఎకరాల్లో మిరుప పంట వేశారు. 5వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగుచేశారు. రైతులు ఒక్కొక్క ఎకరాకు సుమారు రూ.15,000 నుంచి రూ. 20,000 వరకు పెట్టుబడి పెట్టారు. వర్షాభావ పరిస్థితుల వల్ల చెరువులు నిండలేదు. ఆయకట్టు పంటపొలాలు కేవలం వర్షాధారంపై ఆధారపడి ఉన్నాయి. చెరువులు నిండక పోవడంతో చుట్టుపక్కల భూగర్భ జలాలు తగ్గిపోయాయి. పంటలు ఎండుముఖం పట్టాయి. నెట్టెంపాడు ప్రాజెక్ట్ ద్వారా అన్ని చెరువులను నీటితో నింపాలని రైతులు కోరుతున్నారు.

నష్టపరిహారం ఇవ్వాలి



ఈయేడాది వర్షాభావ పరిస్థితుల వల్ల వానాకాలం పంటల దిగుబడి ఘననీయంగా తగ్గనుంది. గతంలో ప్రభుత్వాలు వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంట దిగుబడి తగ్గిపోయినప్పుడు రైతులకు పంట నష్టపరిహారం చెల్లించేవి. ఇప్పుడు ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించాలని కోరుతున్నాం. – నరసింహులు, భూంపురం

పంటలు ఎండుతున్నాయి..



ఈయేడాది వర్షాలు తక్కువ కురువడంతో చెరువులు నిండలేదు. చెరువులకింద వివిధ రకాలపంటలు సాగుచేశారు. వర్షాలు సమయానికి కురవక పోవడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. – తిక్కన్న, తొత్తినోనిదొడ్డి

చెరువులను నింపాలి..



నెట్టెంపాడు ప్రాజెక్ట్‌లో నిర్మించిన రిజర్వాయర్ల నుంచి చెరువులకు కాలువల ద్వారా నీటితో నింపాలి. అలాంటి పనిచేయకపోవడంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడంతా చెరువు కింద సాగుచేసే పంటలు ఎండిపోతున్నాయి. – ఈరన్న, బింగుదొడ్డి

నివేదిక పంపుతాం..



వర్షాభావ పరిస్థితుల వల్ల దిగుబడులు తగ్గిపోతున్నాయి. పంట నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటి వరకు ఉన్నతాధికారుల నుంచి మాకు పంటల దిగుబడిపై సర్వే చేయాలని ఆదేశాలు రాలేదు. అధికారులు ఆదేశిస్తే సర్వే నిర్వహించి నివేదిక అందజేస్తాం. – శంకర్‌లాల్, మండల వ్యవసాయ అధికారి

సామాజిక సేవ అలవర్చుకోవాలి



డిగ్రీ కళాశాల ఆవరణలో చెత్తాచెదారం తొలగిస్తున్న విద్యార్థినులు, అధ్యాపకులు



ఉండవెల్లిలో డీఆర్‌డీఓ ఉమాదేవి ఆధ్వర్యంలో స్వచ్ఛ్ భారత్‌లో అధికారులు, ప్రజా ప్రతినిధులు

గద్వాల అర్బన్: విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవ చేయడం అలవర్చుకోవాలని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపతినాయుడు, ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల, ప్రియదర్శిని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వేర్వేరుగా స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేశారు. సందర్భంగా పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చవ్వా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామన్నారు.

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛ్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎస్‌బీఐ అధికారులు స్వచ్ఛ్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచ్ రేఖ, డీఆర్‌డీఓ ఉమాదేవి, కంచుపాడులో సర్పంచ్ శేషన్ గౌడు, బొంకూరులో సర్పంచ్ శ్రీలత పాల్గొన్నారు.

మాచర్లలో స్వచ్ఛ భారత్

గట్టు: మండలంలోని మాచర్లలో పంచాయతీ, పాఠశాల ఆవరణాన్ని శుభ్రం చేశారు. శ్రమదానంతో చెత్తను తొలగించారు. అనంతరం మహిళలు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూస్తామని ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు వెంకటేష్, సీసీ శివకుమార్, వీఓఏలు ప్రకాష్, జమ్మన్న, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.



ఎర్రవల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ధర్మవరంలో అడిషనల్ డీఆర్‌డీఓ నాగేంద్రం, ఎర్రవల్లిలో ఏపీఓ అనిల్ కుమార్, బీచుపల్లిలో స్వామి వివేకానంద, వసంతనగర్ యూత్ ఆధ్వర్యంలో స్వచ్ఛ్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు వ్యర్థ కవర్లు, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలి



పెద్దపల్లి దగ్గర రోడ్డుపై ఏర్పడిన గుంత

మల్దకల్: గద్వాల–అయిజ ప్రధాన రహదారిలోని పెద్దపల్లి వద్ద రోడ్డు ప్రమాదకరంగా మారిందని వాహనదారులు, ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తెలిపిన పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు నివారించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

దేవునికి ఇష్టానుసారంగా జీవించాలి



ధరూరు ఎంబీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ధరూరు: ప్రతి ఒక్కరూ తమ ఇష్టానుసారంగా కాకుండా దేవుని ఇష్టంగా జీవించాలని రెవ పాస్టర్ సాగర్ అన్నారు. అక్టోబర్ నెల మొదటి ఆదివారం సందర్భంగా మండల కేంద్రంలోని ఎంబీ షాలేం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘ పెద్దలు సీమోను, సత్యన్న, ఎజ్రా, దానియేలు, యోబు పాల్గొన్నారు.

కాస్మొటిక్ చార్జీలు పెంచాలి

అయిజ: హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ కాస్మొటిక్ చార్జీలను వెంటనే పెంచాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి హరీష్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థులకు 5 నెలల నుంచి కాస్మొటిక్ చార్జీలు ఇవ్వడంలేదని పేర్కొన్నారు. హాస్టళ్లలో స్నానపు గదులు, మరుగుదొడ్ల సౌకర్యం మెరుగుపరచాలని కోరారు.

ప్రభుత్వ పథకాల్లో కమీషన్లు

జెడ్పీ చైర్ పర్సన్ సరిత

గట్టు: ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందాలంటే తప్పనిసరిగా కమీషన్లు సమర్పించుకోవాలని, కమీషన్లు లేనిదే అధికార పార్టీ నేతలు పనులు చేయడం లేదని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ఆరోపించారు. 'తిరగబడుదాం– తరిమి కొడదాం' కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి యల్లందొడ్డిలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. ఇందిరమ్మ రాజ్యం రావాలంటే కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు బండ్లలక్ష్మీదేవి, చంద్రశేఖర్‌రెడ్డి, వరలక్ష్మి, ధనలక్ష్మి వెంకటస్వామిగౌడ్, సత్యనారాయణ, కృష్ణమూర్తి, కృష్ణారెడ్డి, గౌస్, వెంకట్రామిరెడ్డి, మహబూబ్‌పాష పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ సరిత

కళ్లకు గంతలు కట్టి ఆశా కార్యకర్తల నిరసన



మల్దకల్‌లో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

మల్దకల్: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆశా కార్యకర్తలు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు.ఆదివారం మండల తహసీల్దార్ కార్యాయంల ఎదుట ఆశాలు నిర్వహిస్తున్న సమ్మె 6వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కాంతమ్మ, సుజాతలు మాట్లాడారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు నర్సమ్మ, శంకరమ్మ, భారతమ్మ, కేశమ్మ, కృష్ణవేణి, సుజాత పాల్గొన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో ఆశా కార్యకర్తలు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. వడ్డేపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు వారు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం ఏడో రోజుకు చేరింది. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు వామపక్షాల మద్దతు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఆశా కార్యకర్తలు నిరవధిక సమ్మెలో భాగంగా కళ్లకు నల్లబ్యాడ్జీలు కట్టుకొని నిరసన తెలిపారు. వారికి కమ్యూనిస్టులు, కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, మద్దిలేటి, కాంగ్రెస్ మైనార్టీ నాయకులు నయీం, పాల్గొన్నారు.



శాంతినగర్‌లో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

గద్వాల అర్బన్: తమ డిమాండ్లను నెరవేర్చాలని ఆశా వర్కర్లు జిల్లా కేంద్రంలోని రాజీవ్‌మార్గ్‌లో కళ్లకు గంతలు కట్టుకోని నిరసన తెలిపారు. ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మ మాట్లాడారు.

మానవపాడు: మండల కేంద్రంలో ఆశా వర్కర్లు కళ్లకు నల్లగంతలు కట్టుకొని వినూత్నరీతిలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు మాలిక్‌బాషా మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సుజాత, శారద, కర్ణ, పాల్గొన్నారు.

పార్టీ అభ్యున్నతి కోసం పని చేయాలి



శ్రమదానం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

రాజోళి: అంతర్గత విభేదాలు మరిచి పార్టీ అభ్యున్నతి కోసం పని చేయాలని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. ఆదివారం మండల కేంద్రం రాజోళిలోని వైకుంఠ నారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో రూ.25 లక్షలతో నిర్మించనున్న బీసీ కమ్యూనిటీ హాల్‌కు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో కుల మత తారతమ్యాలు లేకుండా అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యత కల్పించామన్నారు. బీఆర్ఎస్‌లోని నాయకుల మధ్య ఉన్న చిన్నపాటి విభేదాలను సరి చేసుకుని పార్టీ అభ్యున్నతి కోసం పని చేయాలని, అధినేత ఆశయాలకనుగుణంగా పార్టీ కోసం పని చేయాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కలిసికట్టుగా పని చేయాలని అన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శ్రమదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ సుగుణమ్మ,వైస్ ఎంపీపీ రేణుక,ఉప సర్పంచ్ గోపాల్, జెడ్పీకో ఆప్షన్ సభ్యుడు నిషాక్, మూగెన్న పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

అలంపూర్: మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో శనివారం రాత్రి పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇటిక్యాల మండంలోని మునగాల, ఆయా గ్రామాలకు చెందిన వారు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఇటిక్యాల మండలం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి, సర్పంచ్ మధు నాయుడు, ఎంపీటీసీ మల్లేష్, వీరన్న, సూరి, ఇబ్రహీం, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతు బీమా చెక్కు అందజేత

అలంపూర రూరల్: మండలంలోని ఉట్కూర్‌కు చెందిన రైతు దావుద్‌మియ్య అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన భార్య యూసుఫ్ బీ, కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరుపున రూ.5 లక్షల రైతు బీమా చెక్కును ఎమ్మెల్యే వారి ఇంటికెళ్లి అందజేశారు.

'గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుదాం'



జూలెకల్‌లో పరిశుభ్రత కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రవీంద్ర

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని పది గ్రామ పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచుదామని అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజలకు ఎంపీడీఓ రవీంద్ర సూచించారు. ఆదివారం ఉదయం మండలంలోని ఆయా గ్రామాల్లోని రోడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ చేసి గ్రామాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే ప్రజలు రోగాల బారిన పడరని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, మల్టీపర్పస్ వర్కర్లు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

అలంపూర్: సమాజంలో పరిశుభ్రమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవడం అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. ఆదివారం అలంపూర్ పట్టణంలో తెలంగాణ హరిత టూరిజం, ఆర్కియాలజీ శాఖల ఆధ్వర్యంలో జోగుళాంబ ఆలయ పరిసరాల్లో శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమంలో జోగుళాంబ ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్య, ఈఓ పురేందర్ కుమార్, ఆలయ ధర్మకర్తలు నీలప్ప, వెంకటేశ్వర్ రెడ్డి, టూరిజం మేనేజర్ అమరేందర్ రెడ్డి, విక్రమ్, దాదాబాషా, మునీందర్ పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్రమోదీ సభకు తరలిన నాయకులు

గద్వాల రూరల్: దేశప్రధాని నరేంద్రమోదీ పాలమూరులో ఆదివారం నిర్వహించిన భారీ బహిరంగ సభకు గద్వాల, అలంపూరు నుంచి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. సుమారు 800వందల వాహనాలు ప్రధాని సభకు తరలివెళ్లినట్లు జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి తెలిపారు.

అయిజ: ప్రధాని నరేంద్రమోదీ 'పాలమూరు ప్రజాగర్జన' బహిరంగ సభకు మండల కేంద్రం, గ్రామాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు బయలు దేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శేఖర్, కార్యకర్తలు ఉన్నారు.

గట్టు: పాలమూరు ప్రజాగర్జన సభకు మండలంలో వివిధ గ్రామాల నుంచి బీజేపీ నేతలు తరలి వెళ్లారు. బీజేపీ నాయకులు మధుసూదన్‌రావు, సంధ్య నర్సన్‌గౌడు, రాముడు, కొళాయి భాస్కర్, తిమ్మప్ప, రమేష్, నాగయ్య, చిట్టెయ్య, లక్ష్మణ్ ఉన్నారు.



ప్రధాని మోదీ సభకు తరలివెళ్తున్న గద్వాల బీజేపీ నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: మహబూబ్‌నగర్‌లో పాలమూరు ప్రజా గర్జన సభకు ఇటిక్యాల మండలంలోని బీజేపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్, దశరథం, సంపత్, తదితరులు ఉన్నారు.



జిల్లా కేంద్రంలో,చేపలమార్కెట్ వద్ద రోడ్డు ఇలా..

గద్వాల–అయిజ వెళ్లేదారిలో ఇలా..

జిల్లా కేంద్రం.. రోడ్లు ఛిద్రం

గద్వాల పట్టణం పేరుకే జిల్లా కేంద్రంగా ఉంది. 'ఏ రోడ్డు చూసినా.. ఏమున్నది గర్వకారణం' అన్న చందంగా పట్టణంలో రోడ్లు అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లు బురదమయం అవుతున్నాయి. పట్టణంలో చేపల మార్కెట్, అంబేద్కర్ చౌక్, క్రిష్ణవేణి చౌరస్తా, రెండో రైల్వేగేటు, దానప్యాక్టరీ తదితర రోడ్లు గుంతలు పడి ఛిద్రమయ్యాయి. అయిజ రోడ్డులో అడుగుకో గుంత పడింది. ఈ ఏడాది జూన్ నెలలో ఐడీఓసీ కార్యాలయ ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ గద్వాలకు రాగా, రైల్వేస్టేషన్ నుంచి తెలంగాణ చౌరస్తా (మేలచెర్వు)వెళ్లే దారి వరకు రోడ్డు వేశారు. ఈ రోడ్డు అప్పుడే గుంతలమయం కావడం నాణ్యతకు నగబాటుగా మారింది. అధికారులు, పాలకులు రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించడం లేదు. దీంతో ప్రజలకు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. –గద్వాల అర్బన్

గిన్నిస్ వరల్డ్ రికార్డర్‌కు సన్మానం

వనపర్తిటౌన్: గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం దక్కించుకున్న పట్టణవాసి మారం ప్రశాంతిని ఆదివారం సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి చెందిన ప్రశాంతి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం దక్కించుకోవడం అభినందనీయమన్నారు.